
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
గురువారం 23 మే 2024





పోలింగ్ తర్వాత వైసీపీ మూకలు తగలబెట్టిన కారు



పల్నాడు వదిలి.. పరార్!



మహిళపైనా పిన్నెల్లి దౌర్జన్యం..

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లి ఈవీఎంను నేలకేసి కొట్టి వీధి రౌడీలా ప్రవర్తించారు. ఈ ఘటనపై పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యేను ఓ మహిళ నిలదీశారు. ఈ క్రమంలో పిన్నెల్లి ఆమెపై దుర్భాషలాడారు. దౌర్జన్యం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



పాలువాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మలికా గార్గ్







పోలింగ్ తర్వాత రోజు వైసీపీ మూకల దాడులు

అవును.. ఇన్నాళ్లికి పాపం పండిందంటున్నారు బాధితులు. ఇన్నాళ్లు చంబల్‌లోయను తలపించే అరాచకం మాచర్ల నియోజకవర్గంలో జరిగిందని చెబుతున్నారు. పిన్నెల్లి సోదరులు చేసిన విధ్వంసాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎమ్మెల్యే ఏకంగా పోలింగ్ బూత్‌లో ఈవీఎం విధ్వంసం చేస్తున్న వీడియో కలకలం రేపింది. ఓటమి భయంతో బూత్‌లలోకి చొరబడి దాడులకు తెగబడిన దృశ్యాలు వారి అరాచకానికి పరాకాష్టగా నిలిచాయి. ఈవీఎం విధ్వంసం కేసులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు సమాచారం.. హైదరాబాద్‌లో పోలీసులు పిన్నెల్లిని బుధవారం అదుపులోకి తీసుకున్నారని ప్రచారం... ఈ రెండూ నిర్ధారణ కాకపోయినా రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనం రేకెత్తించింది.

- పిన్నెల్లి బ్రదర్స్ కోసం పోలీసుల వేట

- ఈవీఎం విధ్వంసం చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి
- వీడియో వెలుగులోకి రావడంతో పరారీ
- హైదరాబాదులో గాలిస్తున్న ఏపీ, తెలంగాణ పోలీసు బృందాలు
- పోలీసుల అదుపులో ఉన్నాడంటూ వదంతులు
- నిర్ధారించని పోలీసులు
- సినిమా ఫక్కీలో పిన్నెల్లి కోసం పోలీసులు ఛేజింగ్

నరసరావుపేట, మే 22: పోలింగ్ రోజు ఈవీఎం, వీవీప్యాట్లను ధ్వంసం చేసి అరాచకం సృష్టించిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నాడు. హైదరాబాబులో పోలీసులు పిన్నెల్లిని బుధవారం అదుపులోకి తీసుకున్నారని ప్రచారం. అయితే పోలీసుల అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించలేదు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. పట్టుకునేందుకు పోలీసులు కూడా అదే రేంజ్ వేటాడుతున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ పిన్నెల్లిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పిన్నెల్లి విదేశాలకు పారిపోయేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానంతో అన్ని ఎయిర్ పోర్టులలో ఏపీ పోలీసులు అప్రమత్తం చేశారు. లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

పెన్నెల్లిని శాశ్వతంగా రాజకీయ బహిష్కరణ చేయాలి: జూలకంటి

ఈవీఎంను పగలగొట్టిన ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. అరాచకాలకు పాల్పడిని వైసీపీ నేతలను కౌంటింగ్ ఏజెంట్లుగా కూడా అనుమతించ కూడదని చెప్పారు. ఈసీ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎస్ జవహర్‌రెడ్డి కనుసన్నల్లో వైసీపీ మూకలు దాడులకు యత్నిం చాయని బ్రహ్మారెడ్డి ఆరోపించారు.

పది సెక్షన్లతో కేసుల నమోదు..



ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 143, 147, 448, 427, 353, 452, 1202, చట్టం 131, 135 సెక్షన్లతో కేసులు నమోదయ్యాయి. 20న పిన్నెల్లిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. పిన్నెల్లిపై అదనపు సెక్షన్లు కూడా పెట్టేందుకు కోర్టులో మెమో పోలీసులు దాఖలు చేశారు. పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేసే అవకాశం ఉంది. ఈవీఎంల ధ్వంసం ఘటనపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎందుకు ఎమ్మెల్యేను అరెస్టు చేయలేదని మండిపడింది. పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనపై వెనువెంటనే నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు సీఈవో ముకేశ్ కుమార్‌కు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

వెబ్ కెమెరాలో దృశ్యాల పరిశీలన

ఈ ఘటనకు సంబంధించి వెబ్ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను కేంద్ర ఎన్నికల అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ విషయాన్ని ఈసీ చాలా తీవ్రంగా పరిగణించింది. ఈ వీడియో బయటికి రాకముందు మాచర్ల నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు చేయలేదని ఎమ్మెల్యే పిన్నెల్లి బుకాయించాడు. మాచర్ల అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆర్వో... పిన్నెల్లి చేత ప్రమాణం చేయించారు. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తానని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని ప్రమాణం చేశారు. ఇందుకు విరుద్ధంగా ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లిని ఎన్నికల నియమావళి ప్రకారం కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పోలింగ్ రోజు ఈవీఎంలను పగలగొడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

పోలింగ్ రోజున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. టీడీపీ శ్రేణులపై దాడులతో పాటు ఓటమి భయంతో పిన్నెల్లి సోదరులు బూత్‌లలోకి స్వయంగా చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేసిన దృశ్యాలు కలకలం రేపాయి. రెంటచింతల మండలంలోని పాల్వాయి గేటులో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుండగా.. అక్కడ టీడీపీకే ఎక్కువ ఓట్లు పోలవుతున్నాయని.. తనకు ఓట్లు వేయడం లేదన్న అక్కసుతో పిన్నెల్లి బరితెగించారు. 202వ నంబర్ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి.. ఈవీఎంను ఎత్తి నేలకేసికొట్టారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంటు శేషగిరి రావుపై, ఆయన అనుచరులు దాడి చేశారు. ఆ ఏజెంట్‌పై అదేరోజు బూత్ బయటే గొడ్డలితో దాడి చేశారు. మరోవైపు.. మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు, ఆ మర్నాడు జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని 14న గృహ నిర్బంధం చేశారు. కానీ అదే రోజు అర్ధరాత్రి వారిరువురూ ఇంటి నుంచి పరారయ్యారు. కాగా పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రం అంత సమస్యాత్మకం అయినప్పటికీ ఇద్దరే పోలీసులు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆ అధికారి నివేదిక ఎందుకు ఇవ్వలేదు..

పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించారు. మాచర్ల నియోజక వర్గానికి డీపీవో విజయ భాస్కరరెడ్డిని ప్రత్యేక అధికారిగా నియమించారు. మాచర్ల నియోజక వర్గం లో పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసం చేయడానికి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను సదరు అధికారి ఇవ్వలేదని తెలిసింది. ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేయడం కూడా కంట్రోల్ రూం నుంచి పరిశీలించిన అధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకున్నారు. ఈ అంశంపై కూడా విచారిస్తున్నట్టు తెలిసింది.

దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్

రామకృష్ణారెడ్డి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ వేసుకున్నాడని, అయితే వ్యూహం బెడిసి కొట్టిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నాడని, అయితే మధ్యా హ్నం 12 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ఎయిర్ పోర్ట్‌లో ఏపీ పోలీస్ టీమ్ మాటు వేసిందని తెలుసుకొని వెళ్లలేదని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా పోలీసులు ఎయిర్ పోర్టులో ఉన్నారనే విషయం తెలుసుకున్న పిన్నెల్లి తప్పించుకునేందుకు రూట్ మార్చినట్టు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో కారు డ్రైవర్

పిన్నెల్లి కదలికలను పోలీసులు ట్రాక్ చేస్తుండడంతో సంగారెడ్డి జిల్లా కంది వద్ద కారు, డ్రైవర్, మొబైల్‌ను వదిలేసి వేరే వాహనంలో పరారు అయ్యారని సమాచారం. దీంతో కారు డ్రైవర్, గన్‌మెన్‌లను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి ఆశ్రయం ఇచ్చినవారిని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తునట్టు తెలుస్తోంది.

ప్రాణ భయంతో పొలాల్లో దాక్కున్నా..

- పాల్వాయి గేటు పోలింగ్ బూత్ టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు

గుంటూరు, మాచర్లటౌన్: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన రౌడీ మూకలతో రాడ్లు, కర్రలు, గొడ్డలి, మారణాయుధాలతో నాపై దాడికి దిగారు.. నా తలపగిలినా వదిలిపెట్టకుండా మారణాయుధాలతో దాడి చేస్తుంటే ప్రాణ భయంతో పొలాల్లోకి పరుగులు తీశా.. పిన్నెల్లి సోదరుల నుంచి నాకు, నా కుటుంబానికి ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి.. అంటూ పాల్వాయి గేటు గ్రామానికి చెందిన టీడీపీ ఏజెంట్ నంబూరు శేషగిరిరావు ఆవేదన వ్యక్తం చేశారు.. గుంటూరులోని టీడీపీ మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఫోన్లో పరామర్శించిన చంద్రబాబు

ఎమ్మెల్యే అభ్యర్థి పీఆర్కే ఈవీఎం ధ్వంసం, శేషగిరిరావు ధైర్యంగా అడ్డుకోవడం వంటివి మీడియా ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు తెలుసుకున్నారు. టీడీపీ నేత చప్పిడి రాము ఫోన్ ద్వారా శేషగిరిరావును టీడీపీ అధినేత చంద్రబాబు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ రోజున ఏం జరిగిందంటే..

13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాల్వాయిగేటు 202 పోలింగ్ బూత్‌లో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన విధ్వంసంపై శేషగిరిరావు మాటల్లో... పోలింగ్ రోజున తాను టీడీపీ ఏజెంట్‌గా ఉన్నా, రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో జొరపడి దుర్భాషలాడుతూ ఈ బూత్‌లోనే కదా టీడీపీకి అనుకూల ఓట్లు పడుతుంది అంటూ ఈవీఎంను నేలకేసి కొట్టి ధ్వంసం చేశారు. నేను ధైర్యంగా ఎదురునిలిచి రామకృష్ణారెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశానన్నారు. అదే రోజున రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ రౌడీ మూకలు నా తలపై వేటు వేశారు, అంతటితో ఆగకుండా చేయి, కాళ్ల, నడుముపై రాడ్లతో దాడి చేశారు. గాయాలపాలైన నేను రక్షించండి అంటూ కేకలు వేయడంతో ఓటు వేయడానికి వచ్చిన గ్రామస్తులందరూ ఎమ్మెల్యే పీఆర్కేను నిలదీశారు. అయినా అతను, అతని అనుచరులు జనంపై కూడా రాళ్ల దాడి చేశారు. ఆ రోజు నుంచి అజ్ఞాతంలోకి వెళ్లి బుధవారం బయటకు వచ్చానన్నారు. తీవ్ర గాయాలపాలైన నేను అదే రోజున పొలాల్లోకి వెళ్లి బిక్కుబిక్కుమంటూ జీవించానని చెప్పారు. ఆర్ఎంపీ డాక్టర్ సాయంతో చికిత్సను పొందా. తలకు కుట్లు కూడా పడ్డాయి. పీఆర్కేను అరెస్టు చేస్తారని తెలిసి అజ్ఞాతం వీడి బయటకు వచ్చా. పీఆర్కే నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, కనపర్తి శ్రీనివాసరావు సహకారంతో డీజీపీని కలిసి వాస్తవాలు వివరించి ప్రాణ రక్షణ కల్పించాలని కోరనున్నానని చెప్పారు. అనంతరం బ్రహ్మారెడ్డి, కనపర్తి, టీడీపీ నేతలతో కలిసి ఆయన ఎస్పీ తుషార్ డూడికి తన సమస్యను వివరించి, రక్షణ కల్పించాలని కోరారు.

ఈవీఎం ధ్వంసంపై నిర్లక్ష్యంగా ఎఫ్ఐఆర్ నమోదు

పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసినా ఇందుకు సంబధించిన కేసుల నమోదులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. రెండ్రోజుల పాటు పోలీసులు కోరినా పీవో సైడింగ్ అధికారి ఎమ్మెల్యే చంపుతారనే భయంలో ఫిర్యాదు చేయలేదంటున్నారు. 13న జరిగిన ఈవీఎం ధ్వంసం ఘటనపై 15న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులు ఈవీఎం ధ్వంసం చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించారని సెక్షన్లు నమోదు చేశారు. ఐపీసీ 448 పీపీడీపీ చట్టంలోని సెక్షన్ 3, ఐపీసీ 427 ఆర్‌డబ్ల్యూ 34 కింద కేసు పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అని వీఆర్ఓ పేర్కొనడంతో వెబ్ కాస్టింగ్ ఫుటేజ్ కావాలని పోలీసులు ఈసీకి లేఖ రాశారు. పోలీసుల లేఖతో సీసీ టీవీ ఫుటేజ్ ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈ ఫుటేజ్ వెలుగు చూడటంతో పిన్నెల్లి సాగించిన విధ్వంసకాండ, ఈవీఎంల ధ్వంసం వెలుగు చూసింది.

పోలా.. పరువు పోలా!

- ఏమీ జరగనట్టు నటించారు
- అరాచకాలను కప్పెట్టారు.. అడ్డంగా దొరికిపోయారు
- పిన్నెల్లి ప్రజలకు ఇప్పుడేమి సమాధానం చెబుతారు

నరసరావుపేట, మే 22: పోలింగ్ రోజు అరాచకాలు యథేచ్ఛగా జరిగాయి. వైసీపీ గుండాలు పేట్రేగిపోయాయి. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఓ వీధి రౌడీ మాదిరి ఏకంగా ఈవీఎంలనే ధ్వంసం చేశాడు. ఇంత పెద్దఎత్తున హింసాత్మక సంఘటనలు జరిగితే ఏమీ జరగనట్టుగా సంబంధిత అధికారులు వ్యవహరించారు. ఏమీ జరగనట్టు అంచా గప్‌చుప్‌గా ఉన్న ఎన్నికల యంత్రాంగం వైఖరిని వీడియో దృశ్యాలు వెలుగులోకి తెచ్చాయి. దీంతో అధికా రుల పరువు పోయినట్లయింది. పోలింగ్ నిర్వహణలో అడు గడుగునా సబంధిత అధికారులు పిన్నెల్లి లాంటి వ్యక్తులకు కొమ్ము కాశారన్న విమర్శలకు బలం చేకూరింది.



పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా తాను నిజాయితీ పరుడనని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నానని బుకాయిస్తున్నాడు. ఓ మీడియాలో మాట్లాడుతూ ఇదే ప్రయత్నం చేశారు. 14న పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను హౌస్ అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంటిలో ఉండాల్సి పిన్నెల్లి బ్రదర్స్ లేరు. ఇంటిలో ఉండాల్సి వ్యక్తులు బయటకు వెళ్లడాన్ని ఏం అనాలి. దీనిని పారిపోవడమే అంటారు.

అడుగడుగునా వైఫల్యం

అడుగడుగునా ఎన్నికల యంత్రాగం.. పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ కోసం పోలీంగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి క్షణం పోలింగ్ బూత్‌లలో జరిగే సంఘటనలను రికార్డు చేస్తారు. ఈవీఎంలు ధ్వంసం చేస్తున్న దృశాలు రికార్డు అవుతున్న తరుణంలో లైవ్‌లో కూడా పరిశీలిస్తారు. అప్పుడే విధ్వంసాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ఈసీకి నివేదించాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా అమలు కాలేదు. ఈవీఎంలను ధ్వంసం చేశాక వాటిని సరిచేసేందుకు పోలింగ్ బూత్‌లకు సబంధిత సాంకేతిక సిబ్బంది, సబంధిత అధికారులు బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంలో ఏ బూత్‌లో ఎవరు ఈవీఎంల ధ్వంసంకు పాల్పడారు అన్న సమాచారాన్ని సేకరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండటంలో ఆంతర్యం ఏమిటి?. అరాచకాల గురించి ఫిర్యాదులో విషయం నమోదు చేశారా లేదా? సీసీ ఫుటేజ్ చూసే వరకు విషయం అంత గోప్యంగా ఎందుకు ఉంచారు? పోలింగ్ అధికారులు ఎవరికి కొమ్ము కాశారు? సిట్ బృందం జరిపిన పరిశీలనలో ఈ విషయాన్ని విచారణ నివేదికలో నమోదు చేశారా? వీటికి అధికారులు నివృతి చేస్తారో లేదో చూడాలి.

మాచర్లలో అలర్ట్

- ఎమ్మెల్యే అరెస్ట్ అయ్యారంటూ వదంతులు..

మాచర్ల రూరల్: ఈవీఎం ధ్వంసం కేసులో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ అయ్యారంటూ సోషల్ మీడియాలో వదంతులు దావానంలా వ్యాపించాయి. దీంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పట్టణంలో దుకాణాలను మూసివేయించారు. దీంతో ఒక్కసారిగా పట్టణమంతా నిర్మానుష్యంగా మారింది. అల్లర్లు జరుగుతాయని పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాగా పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు.



మాచర్లలో దుకాణాలు మూయిస్తున్న పోలీసులు

రెచ్చి పోతున్న.. మట్టి మాఫియా

- ఓబులనాడుయుపాలెం వద్ద ఆగని అక్రమ మట్టితవ్వకాలు
- ప్రతి రోజూ అర్ధరాత్రి తరలింపు
- ఇప్పటికీ కాపు కాస్తున్న అధికారులు

ప్రత్తిపాడు, మే 22: రూరల్ మండలం ఓబులనాయుడుపాలెం, నాయుడుపేట సమీపంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు ఇంకా తామే అధికారంలో ఉన్నాం... మా ఇష్టమొచ్చినట్టే సాగుతుంది అన్నట్లు అక్రమ మట్టి తవ్వకాలు చేస్తుంటే.. అధికారులు సైతం అదే రీతిలో వారికి కాపు కాస్తున్నారు. దీంతో ఎప్పటిలాగే.. రూరల్ మండలంలో అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం కొనసాగుతూనే ఉంది. వైసీపీ నాయకుల కనుసన్నల్లో అర్ధరాత్రి దాటిన తరువాత కొండల మాటు నుంచి తవ్వకాలు జరుగుతున్నాయి. ఎక్కడ స్థలం కనిపిస్తే అక్కడ వారి ఇష్టమొచ్చినట్టు మట్టిని తవ్వేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా వందల కొద్ది అడుగుల లోతులో డొంక రోడ్డు వెంబడి జరుగుతున్న ఈ అక్రమ మట్టి తవ్వకాల వలన ప్రజలకు ప్రాణహాని పొంచి ఉన్నా అధికారులు సైతం మౌనం వహిస్తున్నారు. ఎన్నికలు జరిగి ఫలితాలు రావడానికి రోజుల వ్యవధి ఉన్నా.. ప్రస్తుతం పాలన మొత్తం అధికారుల చేతుల్లో ఉన్నప్పటికీ వైసీపీ నాయకుల అక్రమార్జనకు వారు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.



ఓబులనాయుడుపాలెం వద్ద జరుగుతున్న మట్టి తవ్వకాలు

గుంటూరు రూరల్ మండలంలోని ఓబులనాయుడు పాలెం, నాయుడుపేట సమీపంలో నిరంతరం జరుగుతున్న అక్రమ మట్టి వ్యవహారాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి పార్టీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు తన సిబ్బందితో మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతానికి వెళ్లి వారు చేస్తున్న అక్రమాలను ఎండగట్టారు. అప్పటి నుంచి మట్టి మాఫియా తమ పంథాను మార్చుకున్నారు. పగలు మట్టి తవ్వకాలను ఆపివేసి రాత్రి పూట తవ్వకాలు మొదలు పెట్టారు. ఐదు గంటల పాటు తవ్వకాలు జరిపేసి తెల్లరే సరికి ఏమి తెలియనట్టు మౌనంగా ఉంటున్నారు. అంతే కాకుండా గతంలో పొక్లయినర్‌ను ఎక్కడైతే తవ్వకాలు చేస్తున్నారో అక్కడే ఉంచేవారు. కాని ఇప్పుడు వాటిని అక్కడి నుంచి తీసుకువచ్చి పక్కనే ఉన్న జగనన్న కాలనీలో గృహాల మధ్య ఉంచుతున్నారు.

నాడు నేత బంధువులు.. నేడు స్థానిక నేతలు

నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ప్రకటించే ముందు వరకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో నేత బంధువులు రూరల్ మండలంపై రాబందువులుగా మారి మట్టిని కొల్లగొట్టారు. వారి కనుసన్నల్లో కోట్లాది రూపాయల ప్రజాధనం వారి జేబుల్లోనికి వెళ్లింది. ఇన్‌చార్జిల పాలన వచ్చిన తరువాత కూడా మట్టి తవ్వకాలు జరిగాయి. అయితే వాటిని వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కొందరు నాయకులు ఇప్పుడు రెచ్చిపోతున్నారు. తమదే రాజ్యం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనికి అధికారులు సైతం మౌనంగా వ్యవహరిస్తుండంతో పాటు అధికారుల అండదండలు కూడా పూర్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే అధికారులు వారివైపు కన్నెత్తి చూడటం లేదనే వాదన కూడా బలంగా వినిపిస్తుంది.



ఓట్ల లెక్కింపు.. భారీ భద్రత

- జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎక్కడా చిన్నపాటి సమస్యలు కూడా తలెత్తరాదని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన ఎస్పీ తుషార్ డూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుం టూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి ఏఎన్‌యూలో పర్యటించారు. తొలుత స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు ఫలితాల ను వెంటనే ప్రకటించే విధంగా మీడియా సెంటర్‌లో చర్యలు చేపట్టాలని, ఇందు కోసం అక్కడ డిజిటల్ స్క్రీన్‌లు, మైక్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. డైకమెన్ ఆడిటోరి యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సం దర్శించి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు హాజరయ్యే ప్రభుత్వ సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లు, అభ్యర్థుల వాహనాల పార్కిం గ్ స్థలం కోసం యూనివర్సిటీలో స్థలాన్ని పరి శీలించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీకర్, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం ఏఆర్‌ఓ భీమారావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజలక్ష్మి పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వైసీపీ అరాచక శక్తులను అరెస్టు చేయాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి


కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, మే 22 : సార్వత్రిక ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడిన వైసీపీ అరాచక శక్తులను తక్షణమే అరెస్టుచేసి శిక్షించాలని టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసంచేసిన తీరు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనల ఉల్లంఘనలకు పరాకాష్ట అని అన్నారు. అతని నియంతృత్వ చర్యలను అడ్డుకున్న టీడీపీ ఏజెంట్లు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారన్నారు. పోలింగ్ రోజు, మర్నాడు నియోజవకవర్గంలోని పలుచోట్ల దాడులుచేసి, వాహనాలు దహనం చేశార న్నారు. పిన్నెల్లి బ్రదర్స్‌ని ఎన్నికలలో పోటీకి అనర్హులుగా ప్రకటించడంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ నుంచి తొలగించాలన్నారు. గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి రౌడీలతో హల్‌చల్‌చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేకంగా గొడవలకు పాల్పడ్డాడ న్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈసీ ఆదేశాలు దిక్కరించారని, పోలీసు గృహ నిర్బంధం నుంచి తప్పించుకుని కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుపై దాడికి పాల్పడ్డాడన్నారు. ఇవి ఆరోపణలు కాదని, వీడియో, ఇతర సాక్ష్యాలున్నాయని, వైసీపీ అభ్యర్థులను అరెస్టు చేసి శిక్షించాలని, అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పిన్నెల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా


కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మే 22 : పోలింగ్ బూతులోకి తన అనుచరులతో వెళ్లి, ఈవీఎంను ధ్వంసం చేయటమే కాకుండా అడ్డువచ్చిన వారిపై అత్యంత కిరాతకంగా దాడిచేసిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు పన్నిన కుట్రలకు పోలింగ్ రోజు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రవర్తన అద్దం పడుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో ఎక్కడా జరగకుండా సంబంధిత అధికారులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీఆర్కేపై శాశ్వత అనర్హత వేటు వేయాలి

సత్తెనపల్లి, మే 22 : ఈవీఎంను ధ్వంసంచేసిన వైసీపీ మాచర్ల అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా అనర్హత వేటు వేయాలని జై భీమ్ భారత్ పార్టీ జొన్నలగడ్డ విజయకుమార్ ఎన్నికల సంఘాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అయిన అభ్యర్థి తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరపబడి, ఈవీఎం ధ్వంసం చేయటం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేన న్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎన్నికల్లో పాల్గొనకుండా అయనపై అనర్హత వేటు వేయాలని జొన్నలగడ్డ విజయకుమార్ ఎన్నికల సంఘాన్ని కోరారు.

ఈవీఎం ధ్వంసం సిగ్గుచేటు..

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే22: నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ఈవీఎంను ధ్వంసం చేయటం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈవీఎంను ధ్వంసం చేసిన మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణ రెడ్డిపై ఎన్నికల కమీషన్ కఠిన చర్యలు తీసుకోవాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడులు జరిగిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్‌వ్యవస్థ, ఎన్నికల సిబ్బంది ఏమైపోయారని ప్రశ్నించారు. డీజీపీ పోస్ట్‌మ్యాన్ డ్యూటీ చేస్తున్నారని మండిపడ్డారు. సీఎస్ బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తున్నారని, అందుకే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల రోజున దాదాపు 7 పోలింగ్ బూతులలో పిన్నెల్లి అరాచకం సృష్టించారని ఆరోపించారు. పిన్నెల్లి సోదరులను తక్షణమే అదుపులోకి తీసుకోవాలన్నారు. అంతేగాక గత 20 ఏళ్లగా అక్రమంగా సంపాందించుకున్న పిన్నెల్లి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్నారు.

అధికారం అండతో పిన్నెల్లి బ్రదర్స్ దారుణాలు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 22 : రాష్ట్రంలో అధికార వైసీపీ అరాచకాలు, గూండారాజ్యానికి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అయన సోదరుడి అకృత్యాలు ఒక ఉదాహరణ మాత్రమేనని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. శాంతి భద్రతలపై క్షేత్ర స్థాయిలో పోలీసు, అధికార వ్యవస్థ మొత్తం వైసీపీకి పాదాక్రాంతమైన దుస్థితిపై టీడీపీ తరుపున ఫిర్యాదులు అందినప్పుడే ఎన్నికల సంఘం చర్యలు తీసుకొని ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేదా? అని ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో చొరబడి ఈవీఎంను ధ్వంసం చేసేంత ధైర్యం వారికి వచ్చిందంటే ఈసీ, పోలీసుల అలసత్వం కాదా? అని నిలదీశారు. పాలువాయిగేటు ఎన్నికల కేంద్రంలో ఈవీఎం ధ్వంసం కేసులో చర్యలు తీసుకోవడానికి ఇన్నిరోజులు ఎందుకు ఆలస్యమైందో చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. పల్నాడుజిల్లా వ్యాప్తంగా జరిగిన హింసకు, ఈవీఎం ధ్వంసానికి కారణమైన వ్యక్తిని హౌస్ అరెస్టు నుంచి తప్పించింది ఎవరు?, ఇన్ని రోజులుగా అతను ఎక్కడ దాక్కున్నాడు? స్థానిక పోలీసుల సహకారం లేకుండా పిన్నెల్లి సోదరులు పల్నాడు నుంచి పారిపోవడం సాధ్యమేనా? వంటి విషయాలన్నింటికీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, డీజీపీ సమాధానం చెప్పి తీరాలన్నారు. తమ మార్కు రౌడీయిజంతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ తెచ్చిన పిన్నెల్లి సోదరులకు కఠిన శిక్షలు పడేలా చేయటంతో పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవిత కాలంలో నిషేదం విధించాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

వైసీపీ అరాచక పాలనకు త్వరలోనే ముగింపు

● పోలీసులు ఇకనైనా పద్ధతిగా మెలగాలి
● బాంబులు వేసిన వారిపై, వేయనివారిపై ఒకే కేసులా..
● తప్పు చేసిన అధికారులపై విచారణ తప్పదు..
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు


యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 22: ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనకు త్వరలోనే ముగింపు రానున్నదని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 4న రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాబో తుందన్నారు. రెంటచింతల మండలం పాలువాయి గేటులోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసంచేసిన మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల జగన్‌పాలనలో పోలీసువ్యవస్థ నిర్వీర్యమైందని, కొంత మంది అధికారులు నిజాయతీగా పనిచేసినా, మరికొందరి ప్రభుభక్తి పోలీసు శాఖకే మచ్చతెచ్చిందన్నారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాలలో వైసీపీ దాష్టీకాలకు పోలీసులు, అధికారులు ఎవరైతే వత్తాసు పలికారో ప్రభుత్వం మారిన అనంతరం వారందరిపై విచారణలు చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎన్నికలకు ముందు, అనంతరం గురజాల నియోజకవర్గంలో కొంతమంది పోలీసులు వైసీపీకి తొత్తుగా మారి టీడీపీ శ్రేణులపై ఇష్టారాజ్యంగా తప్పుడు కేసులు పెడుతున్నారని యరపతినేని ఆరోపించారు. తంగెడ గ్రామంలో పోలింగ్ బూత్‌పై వైసీపీ గూండాలు బాంబులు విసిరితే టీడీపీ వారిపై హత్యాయత్నం కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా మాదినపాడు, కొత్తపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలను విచక్షణా రహితంగా కొట్టడం దేనికి సంకేతమో ఆ ఎస్ఐలు, సీఐలు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ఘర్షణలు, అక్రమాలపై సిట్ అధికారుల దర్యాప్తు పారదర్శకంగా సాగాలని, తప్పు చేసిన వారిపై, చేయని వారిపై ఒకేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఈ ఎన్నికల్లో అడ్డగోలుగా, అరాచకంగా వ్యవహరించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్ రెడ్డిలు ఇంటికిపోవడం ఖాయమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇబ్బందిపడ్డ ప్రజలతో పాటు పార్టీ నేతలకు, కార్యకర్తలకు అండగా ఉంటానని యరపతినేని భరోసా నిచ్చారు. అదే సందర్భంలో ఈ ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై నోరు పారేసుకున్న, చేయిచేసుకున్నవారు తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచి

వేరుపడిన ఏసీ బోగీలు

● మరమ్మతులకు మూడు గంటలకు పైగా సమయం
● 4.30 గంటల ఆలస్యంగా నడిచిన రైలు
● తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం విశాఖపట్టణం - లింగంపల్లి మధ్యన గుంటూరు మీదగా ప్రయాణించే నెంబరు. 12805 జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. బుధవారం ఉదయం ఈ రైలు విశాఖపట్టణంలో బయలుదేరిన రెండు నిమిషాలకే ఏసీ బోగీల లింకులు ఊడిపోవడంతో సిబ్బంది గమనించి వెంటనే రైలుని నిలిపేశారు. సాంకేతిక లోపాన్ని సవరించి తిరిగి ఫిట్ ఇచ్చేసరికి 3 గంటలకు పైగా సమయం పట్టింది. ఈ కారణంగా మధ్యాహ్నం 1.10 గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్‌కు రావాల్సిన రైలు సాయంత్రం 5.27కి వచ్చింది. అయితే ఎదురు వచ్చే రైళ్ల కోసం జన్మభూమిని పలు చోట్ల లూప్ లైన్‌లో పెట్టారు. ఈ కారణంగా రాత్రి 11 గంటల తర్వాత లింగంపల్లికి రైలు చేరుకొంటుందని ఎన్‌టీఈఎస్‌లో అప్‌డేట్ చేశారు. బుధవారం ఎండ తీవ్రంగా ఉండటంతో ఈ రైలులో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న వారు గంటల తరబడి ఆలస్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మూడు రోజుల పాటు

ఎల్‌సీ గేటు నెంబరు 304 మూసివేత

పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్యనున్న లెవల్ క్రాసింగ్ గేటు నెంబరు. 304ని 3రోజుల పాటు మూసివేస్తున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. అత్యవసర మరమ్మతులు కారణంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 26వ తేదీ రాత్రి 8 గంటల వరకు గేటు మూసి ఉంటుందన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయం చూసుకోవాలని డీఆర్ఎం ఎం.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో

డీఫార్మసీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య),మే 22: గుంటూరు గుజ్జనగుండ్ల సెంటరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీఫార్మసీ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2 సంవత్సరాల కాలపరిమితి గల ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తిచేసిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. అదేవిధంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు లేదా తత్సామాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెంది ఉండీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు ఉన్నవారికి స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందని తెలిపారు. విద్యార్థినులకు కళాశాలలోనే హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు వారి పాస్‌పోర్టు సైజ్‌ఫోటో, రూ.400 దరఖాస్తు ఫీజుతో గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం 93986 20953 నంబరుని సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఉమ్మడి జిల్లా(గుంటూరు, పల్నాడు, బాపట్ల)లోని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ కే.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోరే విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని, 5వ తరగతిలో ప్రవేశం కోసం 2023-24 సంవత్సరాల్లో 4వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఈనెల 24న 5వ తరగతిలో ప్రవేశం కోసం, 25న ఇంటర్‌లో ప్రవేశం కోసం అడవి తక్కెళ్ళపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

గుంటూరు నగరంలో యువకుడి దారుణ హత్య

గుంటూరు, మే 22 : గుంటూరు నగరంలోని అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్ మెయిన్ రోడ్డు వద్ద బుధవారం మధ్యాహ్నం కంచర్ల దేవానందం అలియాస్ దేవా (33) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్థిక లావాదేవీల వ్యవహారంలోనే ఈహత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దేవా స్నేహితులైన అదే ప్రాంతానికి చెందిన పల్లె రాజు, చిలక రాజు అనే ఇద్దరు కత్తులతో పొడిచి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ హత్యకు దేవా మేనమామ జ్యోతిరాజు పైన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ మహేష్, అరండల్ పేట సీఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు..

గతంలో సంజీవయ్యనగర్ 1వ లైన్‌కి చెందిన దేవా కొంత కాలం వలంటీర్‌గా పని చేశాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. అనంతరం విశాఖపట్నం ఉంటున్న దేవా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొంతకాలం క్రితం నగరానికి వచ్చి నగరాలులో నివాసం ఉంటున్నాడు. దేవా రియల్‌ఎస్టేట్ వ్యాపారం లోకి దిగాడు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా దేవాకు హౌసింగ్ బోర్డుకాలనీలో ఉంటూ, నల్లపాడులోని పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేసే తన మేనమామ జ్యోతి రాజుకు రూ.15 లక్షల వరకు బకాయిపడ్డాడు. ఆమొత్తం చెల్లించాలంటూ జ్యోతిరాజు కొంత కాలంగా దేవాపై ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి రాజు 15 రోజుల క్రితం దేవాను చంపుతానని బెదిరించాడు. జ్యోతిరాజు తనకు సొంత మేనమామ కావడంతో ఆయన హెచ్చరికలను దేవా తేలిగ్గా తీసుకున్నాడు. ఇదిలా ఉండగా రెండు రోజులుగా దేవా తన స్నేహితులైన సంజీవయ్య నగర్‌కు చెందిన పల్లె రాజు, చిలక రాజులతో కలిసి మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం దేవ తన కారులో వసంత రాయపురం మెయిన్ రోడ్డులోని బార్‌కు తన ఇద్దరు స్నేహితులు పల్లె రాజు, చిలక రాజులను తీసుకెళ్లాడు. అక్కడ ముగ్గురు కలసి మద్యం తాగారు. అనంతరం ఇంటికి వచ్చేందుకు బయలుదేరారు. మధ్యాహ్నం సుమారు 12: 45 గంటల సమయంలో కారు సంజీవయ్య నగర్ మెయిన్ రోడ్డు వద్దకు రాగానే కారులోవున్న ఇద్దరు స్నేహితులు కత్తులతో దేవాపై దాడి చేశారు. ఈ ఘటనతో తేరుకున్న దేవా తప్పించుకునేందుకు కారు దిగి పారిపోతుండగా వెంటపడి కత్తులతో పొడిచి హత్యచేసి పరారయ్యారు.

దేవా స్నేహితులే నిందితులు కావటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిందితులతో దేవాకు ప్రత్యక్షంగా ఏ వివాదాలు, గొడవలు లేవని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే తనకు రావలసిన బకాయి విషయంలో మేనమామ జ్యోతిరాజు చంపుతానని దేవాను హెచ్చరించినట్లు హతుని సోదరుడు తెలిపాడు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరు నిందితులతో పాటు పోలీసులు అనుమానిస్తున్న జ్యోతిరాజు పరారీలో ఉన్నాడు. దీంతో పోలీసులు అనుమానాలకు మరింత బలం చేకూరినట్లు అయింది. కాగా నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసు బృందాలు రంగంలో దిగి గాలింపు ప్రారంభించాయి.

రాజధాని రైతులకు వార్షిక కౌలు ఇవ్వటం లేదు

● 1618వ రోజుకు చేరిన రైతులు, మహిళల ఆందోళనలు

తుళ్లూరు, మే 22: రాష్ట్ర రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన వార్షిక కౌలు మూడేళ్ల నుంచి అందటం లేదని ఆయా ప్రాంతాల రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 16 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులు మాట్లాడుతూ.. అక్కచెల్లమ్మలకు అండగా ఉంటానని జగన్‌రెడ్డి మోసపు మాటలు చెప్పాడన్నారు. జీవనాధారమైన భూములిస్తే అభివృద్ధి చేయక పోగా చట్టబద్ధంగా ఇవ్వాల్సిన కౌలును ఇవ్వటం లేదన్నారు. దళిత అసైన్డ్ రైతులకు ప్రత్యేక ప్యాకేజీ అని జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. అమరావతి కల్పవృక్షాన్ని జగన్‌రెడ్డి కూల్చి వేయటంతో రాష్ట్ర ప్రజలు ఈ ఎన్నికలలో వైసీపీని తిరస్కరించారన్నారు. అది ఓటింగ్ శాతం చూస్తే కనబడుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.


తుళ్లూరులో నినాదాలు చేస్తున్న రాజధాని ప్రాంత రైతులు, మహిళలు

ఎన్నికల హింసాత్మక ఘటనల్లో 24 మంది నిందితులకు రిమాండ్

● పల్నాడు జిల్లాను జల్లెడ పడుతున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 22 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి ఇప్పటి వరకు సబ్ డివిజన్ పరిధిలో 24 మంది నిందితులను ఆయా పోలీసు స్టేషన్‌ల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటివద్ద చోటుచేసుకున్న ఘటనలో 10 మంది నిందితులను అరెస్టు చేసి బుధవారం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ ఎదుట ప్రవేశ పెట్టగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రిమాండ్‌కు తరలించిన వారిలో రామకోటేశ్వరరావు, శాఖమూరి నవీన్, ఆవుల మణికంఠ, షేక్ నాగుల్ మీర, మహబూబ్ బాషా, బాదర్ ఖాజా, ముత్తిరెడ్డి శంకర్, ఖాజావలి, ఇంటూరి వెంకట మహేష్, తెనాలి తిరుపతిలు ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో 39 మందిని నిందితులుగా గుర్తించారు. కాగా రిమాండ్ సమయంలో కోర్టులో ఆసక్తికరమైన వాదనలు సాగాయి. నిందితుల తరుపున హైకోర్టు న్యాయవాదులు రంగంలోకి దిగి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిమాండ్ చెల్లదని, హత్యాయత్నం కేసు తప్పక మిగతా సెక్షన్‌లన్నీ బెయిల్‌బుల్ సెక్షన్‌లని, హత్యాయత్నం నేరంకు తగిన గ్రౌండ్స్ లేవని, రిమాండ్ తిరస్కరించాలని కోరారు. కాగా దీనికి ప్రతిగా ఏపీపీ లక్ష్మీరామ్‌నాయక్ వాదిస్తూ ఘటనకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, హింసాత్మక ఘటనలకు ఉపయోగించిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, మరి కొందరు నిందితులు అరెస్టు కావాల్సి ఉందని, నిందితులకు రిమాండ్ విధించాలని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి ఆశీర్వాదంపాల్ రిమాండ్‌ను అంగీకరిస్తూ జూన్ 4వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా మరో కేసులో మొదటి పట్టణ పోలీసులు బీజేపీ నేత రంగిశెట్టి రామకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో పమిడిపాడు ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులకు రిమాండ్ విధించారు. రొంపిచర్ల పోలీసు స్టేషన్‌కు సంబంధించి సంతగుడిపాడు గ్రామంలో ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనల్లో ఇరుపక్షాలకు చెందిన 8 మంది నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీకి చెందిన వారినే అరెస్టు చేస్తున్నారు..

ఎన్నికల ఘర్షణల నేపథ్యంలో ఇప్పటి వరకు 24 మందిని పోలీసులు అరెస్టు చేయగా వారిలో ఒకరు కూడా అధికార పార్టీకి చెందిన వారు లేరని టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఆరోపించారు. అంతేగాక పట్టణ పరిధిలోని కొన్ని పోలీసుస్టేషన్‌ల అధికారులు సరైన సమాచారం ఇవ్వటంలేదని, అధికార పక్షానికి చెందిన వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారని, ముఖ్యంగా రూరల్ పరిధిలోని ఓ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఇప్పటికీ అధికార పక్షానికి పూర్తిగా సహకరిస్తున్నారని, సదరు అధికారి పై ఉన్నతాధికారులు దృష్టి సారించి అన్ని పక్షాలకు సమన్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిట్ టీమ్ వచ్చిన సందర్భంలో ఫిర్యాదు ఇవ్వటానికి వెళ్ళిన వ్యక్తుల నుంచి సదరు అధికారి ఫిర్యాదు తీసుకోక పోగా వేరే కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వారిని 3 రోజులు అక్రమంగా నిర్బంధించారని, ఈ విషయాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని లీగల్ సెల్ న్యాయవాదులు డిమాండ్ చేశారు.

బీసీలతో కాంగ్రెస్, బీజేపీల దొంగాట

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి అర్బన్, మే 22: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఓబీసీల న్యాయమైన డిమాండ్లపై దొంగాట ఆడుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. బుధవారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జాతీయస్థాయిలో సమగ్ర కులగణన చేయిస్తామని, సుప్రీం కోర్టు ఇచ్చిన రిజర్వేషన్లను 50 శాతం మించకూడదనే పరిమితిని తొలగిస్తామని కాంగ్రెస్ పార్టీ, తెలంగాణాలో బీజేపీ గెలిస్తే బీసీని సీఎంని చేస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఇస్తున్న హామీలు మ్యానిఫెస్టోలో ఎందుకు చేర్చలేకపోయారో అర్థం కావడం లేదన్నారు. బీసీల సంక్షేమానికి ప్రతి బంధకమైన క్రిమిలేయర్ విధానం ఎత్తివేయడం,కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయడం వంటి అంశాలు మేనిఫెస్టోలో ఎందుకు పొందుపర్చలేదని కేసన ప్రశ్నించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పల్నాడు జిల్లాలో అపహాస్యమైన ప్రజాస్వామ్యం : వేములకొండ



అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం ఉంచుతున్న వేములకొండ, మ్యాని

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో వైసీపీ నేతల హింసను ఖండిస్తూ, అపహాస్యంపాలైన ప్రజాస్వామ్యాన్ని కాపాడమని కోరుతూ ఆయన ఆధ్వర్యంలో బీసీ నేతలు బుధవారం లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అరాచకాలకు కేరాఫ్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అని, ఈవీఎం ధ్వంసం చేయడం పిన్నెల్లి దుర్మార్గానికి పరాకాష్ట అని, వీడియో బయటకొచ్చేవరకు కేసు పెట్టకపోవడం పోలీసుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. అంత స్పష్టంగా పిన్నెల్లి పోలింగు బూత్‌లో చొరబడి ఈవీఎం మెషిన్ బద్దలు గొడితే, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఈవీ ఎం ధ్వంసం చేశారంటూ పోలీసులు కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉం దన్నారు. గతంలో స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యాలు చేసి ఏవిధంగా ఏకపక్షం చేసు కున్నారో అదే విధంగా సార్వత్రిక ఎన్నికలను కూడా జరపాలని కుట్రపన్నారని ఆరోపించారు. దీనిలో భాగంగానే చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డి లాంటి అధికారులను వైసీపీ నేతలు వాడుకున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మద్దిరాల ఇమ్మానుయేల్ మాట్లాడుతూ పల్నాడులో పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసను ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రోత్సహించాడని, మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం రెంటాలలో టీడీపీ ఏజెంట్లు, సానుభూతిపరులపై కర్రలు, కొడవళ్లతో దాడికి దిగారని, టీడీపీ ఏజెంట్ మంజుల నుదిటిపై గొడ్డలితో నరికారు, మరో 50 మందిపైనా దాడి చేశారు. పోలింగ్ అనంతరం పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి కారంపూడిలో బీభత్సం సృష్టించాడన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదాల చినకొండలరావు, గట్టి శ్రీనివాసరావు, సూరె శ్రీనివాసరావు, జంపని నాగేశ్వరరావు, పామర్తి మోహనరావు, కదిరి ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో కుమ్మక్కైన ముద్రగడకు రాజకీయ సమాధే

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బొబ్బిలి రామారావు

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): జగన్‌తో కుమ్మక్కై ప్యాకేజీ తీసుకున్న ముద్రగడ పద్మనాభం తన రాజకీయ జీవితానికి తానే సమాధి కట్టుకున్నాడని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బొబ్బిలి రామారావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపులను ఉద్ధరిస్తాడని నమ్మితే అయన జగన్ పంచన చేరి కాపు ఉద్యమాన్ని విరమించుకుని కాపులను నట్టేట ముంచాడన్నారు. కాపు జాతిని జగన్‌రెడ్డి పాదాలకు అంకితం చేశాడని ఆయన కూతురే గ్రహించి, ఆయనను అసహించుకునే పరిస్థితి తెచ్చుకున్నారన్నారు. ముద్రగడ పవన్‌ను ఓడిస్తానని శపథం చేస్తే, ఆయన కూతురు పవన్ గెలుపు కోసం పనిచేసిందన్నారు. కాపుల రిజర్వేషన్ కోసం, కాపుల మేలుకోసం పాటుబడ్డ చంద్రబాబు కూటమిని గెలిపించి అధికారంలోకి తీసుకురావడానికి కాపులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మన్నవ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దళితుల అణిచివేతకు వ్యతిరేఖంగా పోరాడిన యోధుడు భాగ్యరెడ్డి వర్మ

గుంటూరు(తూర్పు), మే 22 : ఉమ్మడి మద్రాస్, ఆంధ్రా, హైదరాబాద్‌లో దళితుల అణిచివేతకు, అవమానాలకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాన్ని ఉధృతం చేసిన గొప్ప మేధావి భాగ్యరెడ్డి వర్మ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్ కొనియాడారు. బుధవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సభకు భీమ్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ పసుమర్తి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ అంటరాని కులాల వారే ఈ దేశ మూలవాసులని, ఆది హిందువులని ఎలుగెత్తి నినదించిన ఉద్యమ నేత భాగ్యరెడ్డి వర్మ అని గుర్తు చేశారు. దళిత బాలికలకు పాఠశాలలను ఏర్పాటుతో పాటు, దేవదాసి, బసవి, జోగిని వ్యవస్థ దురాచారాలను రూపుమాపేందుకు భాగ్యరెడ్డి పోరాటం చేశారని కొనియాడారు. నేటి యువతరం మహనీయుల ఆశయాలను, ఆలోచనలను కొనసాగిస్తూనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి వందనమ్మ, నూతలపాటి సుబ్బారావు, దొడ్డ రాజేంద్రప్రసాదు, విల్సన్, బత్తుల అనిల్, సతీష్, చిన్నం విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బుద్ధ పూర్ణిమ వేడుకలు

మంగళగిరి, మే 22: గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా మానవతా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన సాయంత్రం మంగళగిరి వైష్ణవి కల్యాణ మండపంలో బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్టు మనవతా వేదిక కన్వీనర్ గోలి మధు, మంగ ళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు ఒక ప్రకట నలో తెలిపారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ అధ్యక్షుడు ఆచార్య నూతలపాటి అరవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు ధర్మ సందేశం అందిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న నృసింహుడి జయంత్యుత్సవాలు



నృసింహునికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మంగళగిరి సిటీ, మే 22: మంగళాద్రి క్షేత్రంలో లక్ష్మీనృసింహ స్వామి వారి జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన బుధవారం వేకువజామున స్వామివారి ఉత్సమూర్తులకు విశేష అభిషేకాలు, చందన అలంకారం, సాయంత్రం నామకరణం, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, దేవదాయశాఖ సహాయ కమిషనరు అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం మహాపూర్ణాహుతి, గ్రామోత్సవంతో జయంత్యుత్సవాలకు ముగింపు పలుకుతారు.

గ్రామాల్లో కవాతు, అవగాహన సదస్సులు

దుగ్గిరాల, మే 22: మండలంలోని పెదకొండూరు, చిలువూరు, ఈమని గ్రామాల్లో ఐటీబీటీ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న తెలియనుండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లోని కూడళ్లలో ప్రజలకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు పెదకొండూరు, ఈమని, చిలువూరు గ్రామాల్లో అవగాహన సదస్సులతోపాటు పోలీసుకవాతు నిర్వహించారు. సీఐ వెంకట్రావు, ఎస్ఐ మహేంద్ర, ఐటీబీటీ బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట పైరుతో

ఫిరంగిపురం, మే 22 : పచ్చి రొట్ట పైర్ల ప్రాధాన్యాన్ని రైతులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని 113 తాళ్ళూరు ప్రకృతి వ్యవసాయ పొలాల్లో రైతులతో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకాలను తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాలను, పొందే మార్గాలను ఆయన తెలిపారు. నేల సారవంతం చేయటానికి 20 ఉంచి 30 రకాల వివిధ రకాల పచ్చిరొట్ట పైర్లను వేసు కోవాలన్నారు. దీంతో దిగుబడులు బాగా పెరుగుతా యన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ నేల తల్లి ఆరోగ్యం కాపాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, ఈహెచ్‌ఏ, వీఏఏ రైతులు పాల్గొన్నారు.

ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లిపై చర్యలు తీసుకోవాలి

● కోవెలమూడి రవీంద్ర(నాని)



విలేకరులతో మాట్లాడుతున్న కోవెలమూడి రవీంద్ర(నాని)

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజున పల్నాడు జిల్లాలో పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉన్న పిన్నెల్లి ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిపోయి ఈవీఎంను నేలకేసి కొట్టడం అత్యంత హేయమన్నారు. మహిళా అధికారులను అసభ్య పదజాలంతో దూషించడం, దుశ్చర్యను అడ్డుకున్న పోలింగ్ ఏజెంటు నంబూరు శేషగిరిరావుని గొడ్డలితో నరకడం ద్వారా అధికార పార్టీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 13న పోలింగ్ జరిగితే ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకు వెబ్‌కాస్టింగ్ ఫుటేజీలు ఎందుకు బయటపెట్టలేదు? అక్కడ రీపోలింగ్‌కి ఎందుకు సిఫారసు చేయలేదు? అంటూ ఆయన నిలదీశారు. సైకో జగన్‌రెడ్డి లాగే వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సైకోలుగా ప్రవర్తిస్తున్నారన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేసి ఈవీఎంలను ధ్వంసం చేసిన బూత్‌ల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు మాట్లాడుతూ పోలింగ్ అనంతరం పల్నాడులో వైసీపీ నేతలు చేసిన దౌర్జన్యాలు కళ్ళకు కట్టినట్లు కనపడినా అధికారులు, పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వైసీపీ నేతల కనుసన్నల్లో ఇంత అరాచకం జరుగుతుంటే ఎన్నికల కమిషన్ చెప్పేవరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఈరంటి వరప్రసాద్ బాబు, ఉప్పుటూరి పేరయ్య యాదవ్, షేక్ రఫీ, కె.ధర్మతేజ, దర్శనపు యాకోబు, ఇత్తడి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మిజోరం గవర్నర్, సీఎంలను కలిసిన శివాజీ

గుంటూరు(కార్పొరేషన్), మే 22: మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి లాల్దుహోమలతో రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సమావేశం అయ్యారు. శివాజీకి గవర్నర్ హరిబాబు బాల్యమిత్రుడు కావడంతో వేసవి విడిది కోసం ఆయనను గవర్నర్ ఆహ్వానించారు. దీంతో బుధవారం కుటుంబ సమేతంగా మిజోరం రాజధాని ఐజ్వల్‌లో హరిబాబు కుటుంబంతో శివాజీ కుటుంబసభ్యులు కలుసుకున్నారు. అనంతరం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి లాల్దూహోమ, మాజీ ముఖ్యమంత్రి జోరంతంగా, ఆ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రేణుశర్మ తదితరులు గవర్నర్ హరిబాబును కలిసి కొద్దేసేపు ముచ్చటించారు. డాక్టర్ శివాజీని ఘనంగా సత్కరించారు.

ఓట్ల లెక్కింపు విధివిధానాలను అధ్యయనం చేయాలి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), మే 22: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధివిధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం ఆర్వో కార్యాలయంలో జూన్ 4న జరిగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్, ఆర్వో మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, విధులకు హాజరయ్యే అధికారులు ఓట్ల లెక్కింపుపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. సమావేశంలో ఏఆర్వోలు సునీల్‌కుమార్, భీమరాజు, ప్రదీప్‌కు మార్, వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణ య్య, ఈఈలు సుందర్రామిరెడ్డి, శ్రీనివాస్, డీఈఈ రమేష్‌బాబు, మేనేజర్ ఎస్ఎస్ ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సూప రిండెంట్లు పాల్గొన్నారు.

సీజీహెచ్‌ఎస్‌కు నేడు శెలవు

గుంటూరు, మే 22: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచితంగా వైద్య సేవలందించే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) కార్యాలయాలకు బుద్ధ పూర్ణిమ సందర్భంగా గురువారం శెలవు దినంగా ప్రకటించారని సీజీహెచ్‌ఎస్ గుంటూరు కార్యాలయ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీసీహెచ్ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హోల్డర్స్ వైద్య సేవల కోసం గుంటూరుకు రావద్దని కోరారు.

పెన్షన్ మంజూరులో అధికారులు ఆలస్యం చేస్తే ఫిర్యాదు చేయవచ్చు

● ఈదర వీరయ్య

గుంటూరు, మే 22: పెన్షన్ మంజూరులో ఆలస్యం చేసినా, కుటుంబ పెన్షనర్లను ఇబ్బంది పెట్టినా అంతర్జాలంలో ఒక్క క్లిక్‌తో రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయవచ్చని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య అన్నారు. పెన్షనర్లు, ఉద్యోగులు వారి సమస్యలపై ఫిర్యాదు చేయటానికి ప్రయాణం కట్టక్కర్లేదని, ప్రజల కోసమే రాష్ట్రపతి, దేశ ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి కార్యాలయాల్లో ప్రత్యేకంగా అంతర్జాలం ద్వారా సమస్యలు తెలుసుకునేందుకు వెబ్‌సైట్లు రూపొందించారన్నారు. సమాజంలోని అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా తదితర విషయాలతో పాటు ఏదైనా సమస్యను జిల్లా, రాష్ట్ర అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం సాధించాలంటే ఒకప్పుడు చాలా కష్టాలు ఎదురవయ్యేవన్నారు. వీటి పరిష్కారం కోసం ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికో, రాజధానికో వెళ్ళినా తీరా సంబంధీకులు అందుబాటులో లేరనే సమాధానం ఎక్కువ సార్లు ఎదురయ్యేదన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పుడు సమ స్యల పరిష్కార మార్గం ఇంటి గడపలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోని నాయకులు, అధికారుల నుంచి రాష్ట్రపతి, ప్రధాని వరకు అందరికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలకు ఆన్‌లైన్‌లో చెక్ పెట్టవచ్చన్నారు. కాలక్షేప ఫిర్యాదులు, అసత్య ఫిర్యాదులకు మాత్రం మూల్యం తప్పదని గుర్తించాలన్నారు. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు ఫిర్యాదులు చేయాలంటే ఆయా ఈ మెయిల్ లింకులపై క్లిక్ చేసి మన ఈ మెయిల్ ద్వారా సమస్యను పంపవచ్చని వీరయ్య అన్నారు.



ఆర్టీవో కార్యాలయం వైపు నుంచి అతివేగంగా దూసుకువచ్చిన కారు మహాలక్ష్మి బార్ సమీపానికి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన వెళుతోన్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో డివైడర్‌ను బలంగా ఢీకొంది. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం నుజ్జు, నుజ్జు అయ్యింది. - గుంటూరు.

ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు



కాపలా నాటికలోని ఓ సన్నివేశం

పెదనందిపాడు, మే 22 : మండలపరిధిలోని వరగాని అంకమ్మగుడి ఆవరణలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో అద్దేపల్లి బసవపున్నయ్య కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు బుధవారం రెండో రోజు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. ఈ పోటీలను డాక్టర్ కక్కెర ప్రజ్ఞశ్రీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు పరిషత్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రథమ నాటికగా రసఝురి పొన్నూరు వారు ప్రదర్శించిన నాటిక మానవుని మేధస్సు అత్యున్నతంగా ఎదిగినా బుద్ధిమాత్రం బురదగుంటలోనే దొర్లుతుందని తెలియజేసే కథనమే కాపలా నాటిక. ద్వితీయ నాటికగా సద్గురు కళానిలయం గుంటూరు వారు ప్రదర్శించిన కమనీయం నాటిక కళాభిమానాన్ని భావితరాలకు పరిచయం చేయాలని చెబుతూ, సమర్థవంతమైన సమసమాజం వైపు అడుగుల వేయాలని చెబుతూ సాగింది. తృతీయ నాటికగా పండు క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు నాటిక నేటి సమాజంలో ఎదుటి వారి అవసరాలను ఆసరాగా తీసుకొని తద్వారా వారికి తీరని కడుపుకోతను మిగుల్చుతున్న తీరును ప్రేక్షకుల కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా మానంపురి సత్యనారాయణ, ముసుగు నాగభూషణం, అనంత ఉదయరాజులు వ్యవహరించారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటి ఎం విజయలక్ష్మిని పోపూరి విజయలక్ష్మీ మహిళా చైతన్య పురస్కార అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో రచయిత, దర్శకులు వైఎస్ కృష్ణేశ్వరరావు, కొండవీటి కళాపరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరి, పరిషత్ గౌరవాధ్యక్షుడు ముద్దన రాఘవయ్య, అధ్యక్ష కార్యదర్శులు పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, కమిటీ సభ్యులు బండారు రాంబాబు, చల్లా నాగరాజు, కొప్రపాటి రామారావు, పోపూరి సుధీర్, చెన్నుపాటి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చేతుల్లేని దివ్యాంగులకు చేయూత

● రోటరీ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు పంపిణీ

● మూడు రోజుల్లో 71 మందికి చేతుల అమరిక



దివ్యాంగుడికి కృత్రిమ చేతులను అమరుస్తున్న నిపుణుడు

మంగళగిరి సిటీ, మే 22: ప్రమాదవశాత్తు చేతులు కోల్పోయిన వారికి మంగళగిరి రోటరీ క్లబ్ చేయూతనందిస్తుంది. జర్మనీకి చెందిన ది హ్యాండ్ ప్రాజెక్టు, మంగళగిరి రోటరీ కరవాలంబన ట్రస్టు సంయుక్త భాగస్వామ్యంతో మూడు రోజుల నుంచి మంగళకరం పేరిట దివ్యాంగ లబ్ధిదారులకు జెమ్ ఎంకే-1 హ్యాండ్స్ ఉచితంగా అందజేస్తున్నారు. మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో వారం రోజులపాటు కొనసాగే ఈ శిబిరంలో ఇప్పటివరకు 71 మందికి కృత్రిమ చేతులను అమర్చారు. ది హ్యాండ్ సంస్థ వ్యవ స్థాపకులు క్రిస్ గల్లి (జెర్మనీ) బృందం కృత్రిమ చేతులను అమరుస్తుంది. ఏపీ, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి చేతులు కోల్పోయిన దివ్యాంగులు ఇక్కడికి తరలివస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అనేక మంది బాధితులు శిబిరానికి విచ్చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యుదాఘాతం వల్ల చేతులు కోల్పోయినట్టు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా పరిగి మండలానికి చెందిన ఓ బాలుడి దీనస్థితి అందరినీ కలచివేసింది. సుమారు 13 సంవత్సరాల వయస్సు ఉన్న షమీ స్నేహితుడిని కాపాడబోయి రెండు చేతులు పూర్తిగా కోల్పోయాడు. షమీ తన స్నేహితుడు జహీర్‌తో కలిసి 2019, డిసెంబరు 8వ తేదీన గాలిపటం ఎగురవేస్తుండగా అది 11 కేవీ హైటెన్షన్ వైరుకు చుట్టుకుంది. జహీర్ ఇనుప రాడ్డుతో గాలిపటాన్ని తీస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని రక్షించబోయిన షమీ సైతం తీవ్రమైన విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ దుర్ఘటనలో జహీర్ ప్రాణాలు కోల్పోగా షమీ కోమాలోకి వెళ్లాడు. 22 రోజుల తరువాత తేరుకోగా అప్పటికే రెండు చేతులూ కోల్పోయి అచేతనుడయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో రోటరీ క్లబ్ కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ గురించి సమాచారం తెలుసుకుని షమీ తన తండ్రి రఫిక్ పాషాతో కలిసి మంగళగిరి వచ్చాడు. జర్మనీ బృందం షమీ పరిస్థితిని వాకబు చేసి చలించిపోయారు. ఆ దివ్యాంగ చిన్నారికి రెండు కృత్రిమ చేతులను అమర్చి ధైర్యం చెప్పారు. కాగా మరో నాలుగు రోజులపాటు జరిగే ఈ శిబిరంలో 300 మంది దివ్యాంగులకు చేతులను అమర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు అందె రేవంత్, ప్రాజెక్టు ఛైర్మన్ అనిల్ చక్రవర్తి, ప్రతినిధులు నూతలపాటి వెంకటేశ్వరరావు, అందె మురళీ, రావెల శ్రీనివాసరావు, ప్రగడ రాజశేఖర్, చనుమోలు గోపాల్, కే.సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలపర్రులో దొంగల హల్‌చల్

● సచివాలయంలో కంప్యూటర్లు, ద్విచక్ర వాహనం చోరీ

పెదనందిపాడు, మే 22: మండలపరిధిలోని పాలపర్రులో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండుగులు కారులో వచ్చి ఇంటి ముందు నిలిపి ఉన్న కె.సాంబశివరావుకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) వాహనాన్ని దొంగిలించి అనంతరం గ్రామ సచివాలయం తాళాలు పగులగొట్టి సచివాలయంలోని రెండు కంప్యూటర్లు, ప్రింటర్, ఇన్వెర్టర్, బ్యాటరీలను సైతం అపహరించుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాసరావు, బాధితుడు సాంబశివరావులు ఫిర్యాదులు చేయగా ఎస్ఐ టి.రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు నుంచి క్లూస్ టీం సభ్యులను పిలిపించి వేలిముద్రల సేకరణ చేపట్టారు.

యజమానిని కొట్టి కారు అపహరణ

విజయవాడ(విద్యాధరపురం), మే 22: బబ్బూరి గ్రౌండ్ సమీపంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కారు యాజమాని జోగి వెంకటేశ్వరరావును కొట్టి కారు అపహరించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడులో జోగి వెంకటేశ్వరరావు భార్య, కుమారుడు, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను ఏపీ 16టీఎల్0933 నెంబరు గల టయోటా కారును కొని అతనే డ్రైవర్‌గా కిరాయిలకు వెళుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటలకు కిరాయికి కారులో భవానీపురం తీసుకువచ్చి వారిని దించి బబ్బూరి గ్రౌండ్ వైపు బయలుదేరాడు. గుర్తు తెలియని ఇద్దరు యువకులు వెంకటేశ్వరరావు కారుకు అడ్డంగా వెళ్లి కారు ఆపారు. ఎందుకు ఆపారని వెంకటేశ్వరరావు ప్రశ్నించగా వారిద్దరూ కారులో ఉన్న బాధితుడిని కిందకు లాగి చేతులతో మొహంపై కొట్టారు. అనంతరం కారును తీసుకువెళ్లిపోయారు. బాధితుడు తన వద్ద సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశాడు. కుటుంబసభ్యులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితుడిని మణిపాల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం : ఎస్పీ

గుంటూరు, మే 22: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరించారు. వచ్చే నెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు, కార్డన్ సెర్చ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక శక్తులను, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. తనిఖీలలో నెంబర్ లేని, రికార్డు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలను స్వాధీనం చేసుకోవాలన్నారు. తనిఖీలు నిర్వహించి సదరు వాహనాలపై జరిమానాలు విధించాలని అవసరం అయితే కోర్టుకు పంపి జరిమానా విధించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణ, నాటుసారా అరికట్టేందుకు, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణిచివేసేందుకుగాను జిల్లాల్లోని డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలిసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది సంయుక్తంగా టీములుగా ఏర్పడి విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ అపరేషన్ నిర్వ హిస్తున్నారు.

ఆకట్టుకున్న మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్



అల్లరి మూకలపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసు బలగాలు

గుంటూరు, మే 22 : రాష్ట్రవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో వచ్చే నెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పూర్తిగా అదుపు చేసేందుకు పోలీస్‌శాఖ సన్నద్ధమైంది. పోలీసులు మాక్ డ్రిల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో అల్లరి మూకలను ఏ విధంగా సమర్థవంతంగా అణచి వేయవచ్చో కళ్ళకు కట్టినట్లు చూపారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మెయిన్ రోడ్డుపై జరిగిన ఈ మాక్‌డ్రిల్ చూపరులను తొలుత ఆందోళనకు గురి చేసినప్పటికీ మాక్‌డ్రిల్ అని తెలియడంతో వారంతా ఆసక్తిగా పోలీస్ బలగాల ఆపరేషన్‌ను గమనించారు.

జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఈస్ట్ డివిజన్ ఏఎస్పీ నచికేత్ షేల్కి లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శాంత కుమార్‌ల ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది బుధవారం బస్ స్టాండ్ వద్ద 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏమైనా అనుకోకుండా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు, హిం సాత్మక చర్యలకు పాల్పడితే ఎవరైనా అల్లర్లు చేస్తున్న సమయాల్లో ఎలా స్పందించాలి, జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొ దటగా హెచ్చరిక ఇచ్చుట, వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీచార్జ్, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయుట వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఈస్ట్ డివిజన్ ఏఎస్పీ నచికత్ షేల్కి, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, పాతగుంటూరు సీఐ రమేష్ బాబు, కొత్తపేట సీఐ అన్వర్ బాషా, ఈస్ట్ ట్రాఫిక్ సిఐ కోటేశ్వరరావు, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరి రెడ్డి, బ్రహ్మానందం, ఇతర ముఖ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● సీఐ కళ్యాణ్‌రాజ్ ● సీతానగరంలో కార్డెన్ సెర్చ్



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ కళ్యాణ్‌రాజ్

తాడేపల్లి టౌన్, మే 22: ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే వరకు అందరూ సంయమనంతో ఉండాలని శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సీఐ కల్యాణ్‌రాజ్ హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం మహానాడు ప్రాంతాల్లో బుధవారం సుమారు 100 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఫలితాలు వెలువడిన అనంత రం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం వంటివి నిషేధమని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ప్రతాప్ కుమార్, రమేష్, సాయిప్రసాద్, ఏఎస్ఐ శాంతకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలందరూ సామరస్యంగా మెలగాలి : డీఎస్పీ

తుళ్లూరు, మే 22: రాజధానిలో ప్రజలందరూ సామరస్యంగా మెలగాలని తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని రాజధాని గ్రామం దొండపాడులో వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. జూన్ 4న కౌంటింగ్ సమయంలో ఆ తరువాత కూడా అన్నీ పార్టీల వారు సామరస్యంగా శాంతియుతంగా ఉండాలన్నారు. ఎటువంట అవాంఛనీయ సంఘనటలు జరగకుండా చూడాలని కోరారు. లేదంటే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అసాంఘీక శక్తుల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ -1 సుభానీ, సీఐ-2 జే అనురాధ వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

435బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 22: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవా రం జరిగిన వేలంలో 435 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,000, గరిష్ఠ ధర రూ.14,700, మోడల్‌ధరరూ.14,300 పలికాయి. కాయ క్వింటాల్ కు కనిష్ఠ ధర రూ.13,100, గరిష్ఠధర రూ.1,4700, మోడల్‌ధర రూ. 14,000 పలికాయి.

ఆలయంలో కట్టడాలను కూల్చివేసిన టౌన్‌ప్లానింగ్



ఆలయంలో నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులోని రాజేశ్వరి గోదాదేవి సమేత వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవాలయంలో నూతనంగా చేపట్టిన నిర్మాణాలను నగర పాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. బుధవారం రాత్రి ఆకస్మాత్తుగా 50 మందికి పైగా సిబ్బంది ఆలయం వద్దకు వచ్చి గోడలను కూల్చివేశారు. అనంతరం ఆలయంలో ఉన్న స్థలం తమది అంటూ ఇనుప కంచెతో ఫెన్సింగ్ వేశారు. ఈ క్రమంలో స్థానిక మహిళలు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి మధ్యన వాదోపవాదనలు జరిగాయి. గుంటూరు పురపాలక సంఘంగా ఉన్నప్పుడే 2000 చదరపు గజాల స్థలాన్ని అప్పటి పాలకవర్గం ఆలయం కోసం కేటాయిస్తూ తీర్మానం చేసిందని స్థానిక మహిళలు తెలిపారు. ఆ తీర్మానం ప్రభుత్వ ఆమోదం కోసం కూడా వెళ్లిందన్నారు. కొంతకాలం క్రితం ఆలయంలో కొంతభాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో తాత్కాలికంగా అర్బన్ మలేరియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు ఏర్పాటు చేసుకొంటామంటే ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆలయ విస్తరణ చేపట్టామని, ఆలయం పశ్చిమ ద్వారాన శానిటరీ, మలేరియా ఆఫీసులు అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించమని కోరుతున్నామన్నారు. అందుకు వారు ససేమిరా అంటూ బుధవారం రాత్రి ఇలా బలప్రదర్శన చేశారని వాపోయారు. దీనిపై తాము చట్టప్రకారం చర్యలు చేపడతామన్నారు.



కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడి' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడి'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ "కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.



లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా
- ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.
- ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.
- దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.
- ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

పారిపోయే పిరికిదాన్ని కాదు



'నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కల్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే



ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్ర్కీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'గేమ్ ఛేంజర్', 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు



నటులను సత్కరిస్తున్న ప్రకాష్

'మానవ రాజ్యం' నటులకు సన్మానం

తెనాలి అర్బన్, మే 22: తెనాలి సమతా ఆర్ట్స్ థియేటర్స్ రూపొందించిన మానవరాజ్యంలో నాటిక విజయవంతమైందని రచయిత, దర్శకుడు ముట్లడి ప్రకాష్ చెప్పారు. ఈ నాటికలో నటించిన నటీనటులను బుధవారం మెమెంటోలతో సన్మానించారు. ఈ నాటిక సమాజాన్ని మేల్కొలిపిందని, కుల, మత సమస్యల నిజ స్వరూపాన్ని ఎత్తి చూపిందన్నారు. రాందేవ్, బెల్లంకొండ వెంకట్, రామరాజు, వసంత యామిని, కనపర్తి మధుకర్, శ్రీరామ్, రమేష్‌లను సత్కరించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, మే 22: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెనాలి రైల్వే పోలీసులు తెలిపారు. తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలకలూరు రైల్వే బ్రిడ్జి సమీపంలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారంతో వెళ్ళి పరిశీలించగా షుమారు 50సంవత్సరాలు వయస్సగల వ్యక్తి ట్రైన్ నుంచి జారిపడి మృతి చెంది ఉన్నాడని, కుడిచేతిపై ఎరుపు కాశీదారం, బ్లూ కలర్ ఆఫ్ నిక్కర్ ధరించి ఉన్నాడు. ఇవితప్ప మరే ఏ ఇతర ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఘనంగా నృసింహస్వామి జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, మే 22: నాజరుపేటలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారిని 108 కలశాల పానకంతో అభిషేకించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. 1906లో ఇక్కడ స్వామివారి ప్రతిష్ట జరిగిందని కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. జూన్ 1న హనుమజ్జయంతి, 5న నృశింహ స్వామి కల్యాణం జరుగుతాయని భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. విజయకుమారి, శ్రీలక్ష్మి, భార్గవ్ పర్యవేక్షించారు.



అభిషేకం చేస్తున్న అర్చకులు

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు రెడ్‌కార్పెట్

తెనాలి అర్బన్, మే 22: ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు రెడ్‌కార్పెట్ వేశారని, దేశం యావత్తు గర్వించదగిన విషయమని మా ఏపీ వ్యవస్థాపకులు దిలీప్‌రాజా చెప్పారు. సుల్తానాబాద్‌లోని రత్నాఫార్చ్యూన్ కల్యాణ మండపంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ఏపీ మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ శుభాకాంక్షలు తెలుపుతూ తీర్మానం చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చలన చిత్ర నైపుణ్యాల ప్రదర్శన కేన్స్ అని అంతర్జాతీయ వేదికపై భారత్‌కు గౌరవం లభించడం ఓ దర్శకునిగా సంతోషంగా ఉందన్నారు. ముస్తజావుద్దీన్ మాలిక్ దర్శకత్వంలో రూపొందించిన గాడ్ మస్ట్ డై అనే చిత్రంలో సాక్షాత్తు దేవుడిని కూడా చంపడం ఊహించలేని కథాంశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసిందని, హాలీవుడ్ స్థాయికి భారత సినిమా ఎదిగిందన్నారు. ఇందులో హీరోగా నటించిన భారతీయుడు సందీప్‌కు కేన్స్‌లో రెడ్‌కార్పెట్ వేయడం మరిచిపోలేని అనుభూతి అని చెప్పారు. సినీ దర్శకులు అచ్చెన శ్రీనివాస్, మిలటరి ప్రసాద్, శ్రీకాంత్, వెంకట్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పేరంటాలమ్మ తిరునాళ్ల

తెనాలి అర్బన్, మే 22: ఐతానగర్‌లో పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీవెంకయ్య, గౌరమ్మ ఆలయంలో ఈ నెల 18 నుంచి మొదలైన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. గుమ్మడిసిడి, ప్రతిమల ఊరేగింపు, జలబిందెలు, పొంగళ్లు, మొక్కుబడులు కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



గుమ్మడిసిరిమాను ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ

● 71 మందికి మంగళగిరి రోటరీ క్లబ్ చేయూత

మంగళగిరి సిటీ, మే 22: ప్రమాదవశాత్తు చేతులు కోల్పోయిన వారికి మంగళగిరి రోటరీ క్లబ్ చేయూతనందిస్తుంది. జర్మనీకి చెందిన ది హ్యాండ్ ప్రాజెక్టు, మంగళగిరి రోటరీ కరవాలంబన ట్రస్టు సంయుక్త భాగస్వామ్యంతో మూడు రోజుల నుంచి మంగళకరం పేరిట దివ్యాంగ లబ్ధిదారులకు జెమ్ ఎంకే-1 హ్యాండ్స్ ఉచితంగా అందజేస్తున్నారు. మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో వారం రోజులపాటు కొనసాగే ఈ శిబిరంలో ఇప్పటివరకు 71 మందికి కృత్రిమ చేతులను అమర్చారు. ది హ్యాండ్ సంస్థ వ్యవస్థాపకులు క్రిస్‌గల్లి (జెర్మనీ) బృందం కృత్రిమ చేతులను అమరుస్తుంది. ఏపీ, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి చేతులు కోల్పోయిన దివ్యాంగులు ఇక్కడికి తరలివస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అనేక మంది బాధితులు శిబిరానికి విచ్చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యుదాఘాతం వల్ల చేతులు కోల్పోయినట్టు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా పరిగి మండలానికి చెంది న ఓ బాలుడి దీనస్థితి అందరినీ కలచివేసింది. సుమారు 13 సంవత్సరాల వయస్సు ఉన్న షమీ స్నేహితుడిని కాపాడబోయి రెండు చేతులు పూర్తిగా కోల్పోయాడు. షమీ తన స్నేహితుడు జహీర్‌తో కలిసి 2019, డిసెంబరు 8వ తేదీన గాలిపటం ఎగురవేస్తుండగా అది 11 కేవీ హైటెన్షన్ వైరుకు చుట్టుకుంది. జహీర్ ఇనుప రాడ్డుతో గాలిపటాన్ని తీస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని రక్షించబోయిన షమీ సైతం తీవ్రమైన విద్యు త్‌షాక్‌కు గురయ్యాడు. ఈ దుర్ఘటనలో జహీర్ ప్రాణాలు కోల్పోగా షమీ కోమాలోకి వెళ్లాడు. 22 రోజుల తరువాత తేరుకోగా అప్పటికే రెండు చేతు లూ కోల్పోయి అచేతనుడయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో రోటరీ క్లబ్ కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ గురించి సమాచారం తెలుసుకుని షమీ తన తండ్రి రఫిక్ పాషాతో కలిసి మంగళగిరి వచ్చాడు. జర్మనీ బృందం షమీ పరిస్థితిని వాకబు చేసి చలించిపోయారు. ఆ దివ్యాంగ చిన్నారికి రెండు కృత్రిమ చేతులను అమర్చి ధైర్యం చెప్పారు. కాగా మరో నాలుగు రోజులపాటు జరిగే ఈ శిబిరంలో 300 మంది దివ్యాంగులకు చేతులను అమర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

అధ్వాన రోడ్లతో ప్రయాణికులకు నరకం

● గుంతలమయంగా రోడ్లు ● కనీస మరమ్మతులు చేయాలని వాహనదారుల విజ్ఞప్తి





గుంతలమయంగా ఉన్న పెదరావూరు ప్రధాన రహదారి, సంగంజాగర్లమూడి గరువుపాలెం వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

తెనాలి రూరల్, మే 22: తెనాలి నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారి ఆ రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ఇటు ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. తెనాలి నుంచి వయా సంగంజాగర్లమూడి మీదుగా నారాకోడూరు వెళ్లేమార్గం, తెనాలి నుంచి నందివెలుగు, కొలకలూరు, హాఫ్‌పేట, కాజీపేట మీదుగా గుంటూరు వెళ్లే రోడ్డు మార్గం, తెనాలి మీదుగా పెదరావూరు, కూచిపూడి వెళ్లే రోడ్డుమార్గం, తెనాలి నుంచి దుగ్గిరాల మీదుగా మంగళగిరి వెళ్లే రోడ్డుమార్గంతో పాటు తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డు సైతం దెబ్బతిని గుంతలయంగా మారడంతో ఆ రోడ్లపై ప్రయాణం చేసే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతూ క్షతగాత్రులవుతున్నారు. ఇందుకు ప్రధానంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రోడ్ల అలనా పాలనా పట్టించుకోకపోవడంతో రోజురోజుకు రోడ్ల నాణ్యతలు దెబ్బతిని వాటికి వాడిని కంకరరాళ్లు, తారు, ఇతర మెటీరియల్ విడిపోయి గుంతలమయంగా మారాయి. నాలుగేళ్లలో కురిసిన వర్షాలకు, అధికలోడ్‌తో వెళ్లే వాహనాలతో ఆ గుంతలు కాస్తా పెరుగుతూ ప్రధాన రహదారులు డొంకరోడ్లను తలపిస్తున్నాయి. ఆ రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు నడుం నొప్పులు, ఇతరత్రా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నామని, అంతేకాక వాహనాలు కూడా టైర్లు దెబ్బతినడం, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెనాలిలో పేరుగాంచిన జిల్లా ప్రభుత్వవైద్యశాల అత్యవసర విభాగానికి వైద్యసేవలకు సైతం ప్రతి రోజు అనేక మందిని 108 అంబులెన్సుల ద్వారా వివిధ ప్రాంతాల నుంచి తీసుకువస్తుంటారు. అయితే అధ్వానంగా ఉన్న ఆ రోడ్లపై వచ్చే క్రమంలో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ప్రయాణం సురక్షితంగా జరిగేలా గుంతలు పూడ్చి కనీస మరమ్మతులు అయినా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.



గులక రోడ్డులా మారిన కొలకలూరు ప్రధాన రహదారి

నేడు అన్నమాచార్య జయంతి ఉత్సవం

తెనాలి అర్బన్, మే 22: బోసురోడ్డులోని వాసవీ అమ్మవారి ఆలయంలో గురువారం తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. రామలింగేశ్వర భక్తసమాజం ఆధ్వర్యంలో బాలబాలికలు, గాయకులు, అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తారు. జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని పీవీఎస్ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, నిరంజనశర్మ, రత్నకుమారి, శ్రీనివాసరావు కోరారు.



గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

తెనాలి అర్బన్, మే 22: నెహ్రూరోడ్డులోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు వేసవి సెలవులను వినియోగించుకునేందుకు వివిధ గ్రంథాలను అందుబాటులో ఉంచారు. కథల పుస్తకాలు, నైతిక విలువలు నేర్పే గ్రంథాలు విద్యార్థులతో చదివించడంతో పాటు హ్యాండ్ రైటింగ్ అభివృద్ధి చేయడం, ఇండోర్ గేమ్స్‌లో నైపుణ్యం, పద్యాలు నేర్పించడం వంటి అంశాలు అమలు చేస్తున్నామని గ్రంథాలయ అధికారి చెప్పారు. కొత్తపేటలోని బాలల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. లైబ్రేరియన్లు రమాదేవి, అంజని పర్యవేక్షించారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

బుర్రిపాలెంలో నరసింహస్వామి కల్యాణం

తెనాలి అర్బన్, మే 22: రూరల్ మండలం బుర్రిపాలెంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త వెంకటేశ్వరరావు, పాండురంగారావు, పద్మావతి, కార్తీక్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



కలుపు మొక్కల నిర్మూలన గురించి వివరిస్తున్న డాక్టర్ సంధ్యాదేవి

కలుపు మొక్కలను నిర్మూలించాలి

● ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సంధ్యాదేవి

కొల్లిపర, మే 22: రైతులు తమ పొలాల్లో ఉన్న వయ్యారి భామ కలుపు మొక్కలను వెంటనే నిర్మూలించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర పంట పొలాల్లో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కలుపు మొక్కలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్క పొలాల్లో ఉంటే రైతులు ఎక్కువగా నష్టపోయే ప్రమాదముందన్నారు. రైతులు నూతన యాజమాన్య పద్ధతులు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రొఫెసర్ సువర్ణలత మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను తప్పని సరిగా పాటించాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడకం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, రావెప్ విద్యార్థినులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యజమానిని కొట్టి కారు అపహరణ

విజయవాడ (విద్యాధరపురం), మే 22: బబ్బూరి గ్రౌండ్ సమీపంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కారు యాజమాని జోగి వెంకటేశ్వరరావును కొట్టి కారు అపహరించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడులో జోగి వెంకటేశ్వరరావు భార్య కుమారుడు, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను ఏపీ 16టీఎల్0933 నెంబరు గల టయోట కారును కొని అతనే డ్రైవర్‌గా కిరాయిలకు వెళుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటలకు కిరాయికి కారులో భవానీపురం తీసుకువచ్చి వారిని దించి బబ్బూరి గ్రౌండ్ వైపు బయలుదేరాడు. గుర్తు తెలియని ఇద్దరు యువకులు వెంకటేశ్వరరావు కారుకు అడ్డంగా వెళ్లి కారు ఆపారు. ఎందుకు ఆపారని వెంకటేశ్వరరావు ప్రశ్నించగా వారిద్దరూ కారులో ఉన్న బాధితుడిని కిందకు లాగి చేతులతో మొహంపై కొట్టారు. అనంతరం కారును తీసుకువెళ్లిపోయారు. బాధితుడు తన వద్ద సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశాడు. కుటుంబసభ్యులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితుడిని మణిపాల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు.

435బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 22: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవా రం జరిగిన వేలంలో 435 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,000, గరిష్ఠ ధర రూ.14,700, మోడల్‌ధరరూ.14,300 పలికాయి. కాయ క్వింటాల్ కు కనిష్ఠ ధర రూ.13,100, గరిష్ఠధర రూ.1,4700, మోడల్‌ధర రూ. 14,000 పలికాయి.

ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై నిర్లక్ష్యం

● ఐదేళ్లుగా అసంపూర్తిగానే భవనం
● పిచ్చిచెట్ల నడుమ శిథిలమవుతున్న నిర్మాణాలు

పొన్నూరు టౌన్, మే 22: నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు అంటూ వారి సంక్షేమానికే పాటుపడుతున్నామని చెప్పే వైసీపీ నాయకుల మాటలు క్షేత్ర స్థాయిలో నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. పొన్నూరు పట్టణంలో 3వ వార్డు ఎరుకల వాడలో ఆరేళ్ల క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎరుకుల వాడ ప్రజల అవసరార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టారు. ఎరుకల వాడ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో లక్షలాది వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం ప్రారంభమయ్యింది. హాల్ నిర్మాణ దశలో ఉండగానే ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో నిర్మాణం అసంపూర్తిగా మారింది. సుమారు 5లక్షలకు పైగా వ్యయంచేసి ఈ నిర్మాణాన్ని చేపట్టారు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని నిలిపివేశారు. ఆనాటి నుంచి ఎస్టీ సంఘాల నాయకులు కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని పాలకుల వద్దకు అధికారుల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఎస్టీల సంక్షేమానికి ఎంతో ఖర్చు చేశామని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్న పాలకులు కమ్యూనిటీ హాల్‌ను పూర్తి చేయకపోవటంపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన నిర్మాణం పూర్తయివుంటే ఎరుకులవాడ ప్రజలకు కమ్యూనిటీ హాల్ ఉపయోగపడి వుండేది. కేవలం రాజకీయ కక్షతోనే ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

3వ వార్డు ఎరుకులవాడ పాఠశాలలో ఐదేళ్ల క్రితం నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ అసంపూర్తి నిర్మాణాలు శిథిలమైపోతున్నాయి. ఐదేళ్లుగా ఒక ఇటుక కూడా పేర్చకపోవటం పాలకుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. ఎస్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణాల గురించి పట్టించుకోకపోవటంతో అసంపూర్తి నిర్మాణాలు శిథిలాలుగా మారి లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిపోయింది. అంతేకాకుండా నిర్మాణం చుటూ పిచ్చిమొక్కలు పెరిగిపోవటంతో స్థానికులు ఆ వైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. శిథిలమైపోతున్న కమ్యూనిటీ హాల్ అంసాఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే తమ ప్రాధాన్యం అని ఊదరగొట్టే ప్రసంగాలు కేవలం మాటలకే పరిమితం అని పలువురు వాపోతున్నారు. తమ సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి వుండి వుంటే కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చివుండేవారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వంలోనైనా కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తిచేసి తమ సంక్షేమం కోసం పాటుపడాలని ఎస్టీ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పిచ్చి చెట్ల మధ్య ఉన్న ఎస్టీ కమ్యూనిటీ హాల్ అసంపూర్తి నిర్మాణం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీ కుమారి

19 రౌండ్లతో పొన్నూరు ఓట్ల లెక్కింపు: ఆర్వో

పొన్నూరు టౌన్, మే 22: పొన్నూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపును 19 రౌండ్లలో చేపట్టనున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఎ లక్ష్మీకుమారి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపునకు మూడు టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ప్రారంభించి తర్వాత ఈవీఎంలోని ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నట్లు చెప్పారు. కౌంటింగ్‌కు 14 మంది ఏజెంట్లు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌కు అభ్యర్థికి కౌంటింగ్ హాల్‌లో ప్రవేశానికి అర్హత ఉంటుందన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ముగ్గురు ఏజెంట్లను నియమించుకోవచ్చన్నారు. లెక్కింపుల వివరాలను అనుసరించాల్సిన వివరాలను అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అభిషేక పూజలందుకుంటున్న సాక్షి భవన్నారాయణ స్వామి

నయనానందకరంగా కల్యాణ మహోత్సవం

● గజ వాహనంపై ఊరేగిన భవన్నారాయణస్వామి

పొన్నూరు టౌన్, మే 22: సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భవన్నారాయణ స్వామి దివ్య కల్యాణ మహోత్సవం నయనానందకరంగా జరిగింది. స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. చందలేపనం చేసి అభిషేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిజరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం గజవాహనంపై పురవీధులో ఉభయదేవేరులతో కలిసి విహరించారు. రాత్రికి ఆలయంలో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తును ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మండేపూడి పానకాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవాని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా గురువారం గరుడవాహన సేవ, సాయంత్ర పురవీధులో రథోత్సవం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లను చేశారు.



ప్రత్యేక పూజలందుకున్న లక్ష్మీ నరసింహ స్వామి

భక్తి శ్రద్ధలతో నరసింహ జయంతి

పొన్నూరు టౌన్, మే22: పట్టణంలోని సాక్షి భవనారాయణస్వామి ఆలయంలో కొలువుతీరిన లక్ష్మీ నరసింహస్వామి ఉపాలయంలో బుధవారం నరసింహ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. నరసింహ జయంతిని పురస్కరించుకుని ఉదయం లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. మధుర ఫలాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. నరసింహ జయంతి వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజాధికాలు నిర్వహించారు.

షిర్డీ సాయి బాబాకు లక్ష మల్లెల పూజ

పొన్నూరు టౌన్, మే 22: పట్టణంలోని సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయి బాబా మందిరంలో బుధవారం లక్ష మల్లెల పూజ భక్తి శ్రద్ధలతో జరిగాయి. సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగి 28ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆలయంలో మహిళలతో లక్ష మల్లెల పూజను నిర్వహించారు. సాయి బాబాకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ లక్ష మల్లెల పూజను మందిర నిర్వాహకులు ఏఆర్‌కేటీ సాయి, సర్వేపల్లి ప్రసాద్ పర్యవేక్షించారు.



లక్ష మల్లెల పూజలందుకున్న షిర్డీ సాయిబాబా



నంబూరు వీవీఐటీలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ బాలికలు

వీవీఐటీలో ఎన్‌సీసీ బాలికల వార్షిక శిక్షణ శిబిరం

పెదకాకాని, మే 22: 10ఏ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ, గుంటూరు గ్రూప్ 7వ వార్షిక శిక్షణ శిబిరం వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం ప్రారంభమైంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.ఏ.ఎస్. సుదర్శన్ పర్యవేక్షణలో 10రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 10ఏ బెటాలియన్ గుంటూరు గ్రూప్‌లోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 632 బాలికలు ఈ వార్షిక శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సైనిక సూత్రాలు, క్రమశిక్షణ, నాయకత్వం, మైత్రి పెంపొందిచే నైపుణ్యాల పెరుగుదల లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎన్.సి.సిలో శిక్షణ పొందే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనీ, శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశం క్యాడెట్ల ఉన్నతికి తోడ్పడుతుందని కర్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమములో వీవీఐటీ ఎన్.సి.సి అఫీసర్ ఎ.శ్రీవాణి, గుంటూరు ఎన్.సి.సి బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, ఎన్.సి.సి. ఆఫీసర్ సయ్యద్ బీబన్ భాషా, ఎ.శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు బుద్ధ పూర్ణిమ వేడుకలు

మంగళగిరి, మే 22: గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా మానవతా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన సాయంత్రం మంగళగిరి వైష్ణవి కల్యాణ మండపంలో బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్టు మనవతా వేదిక కన్వీనర్ గోలి మధు, మంగ ళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ అధ్యక్షుడు ఆచార్య నూతలపాటి అరవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.